

వైసీపీ కార్యాలయం, ప్రహరీ



అక్రమంగా నిర్మించిన జిల్లా వైసీపీ కార్యాలయం

అడ్డగోలుగా 'ప్లాన్'

- కాకినాడలో అనుమతుల్లేకుండా అడ్డగోలుగా జిల్లా వైసీపీ కార్యాలయం నిర్మాణం
- 'కుడా' అనుమతి ఇవ్వకుండానే నిబంధనలకు విరుద్ధంగా భారీ రాజప్రాసాదం
- 1.92 ఎకరాల్లో జీప్లస్ వన్ విధానంలో 1,130 చదరపు అడుగుల్లో నిర్మాణం
- అటు అధికారం అండతో పార్టీ కార్యాలయం కోసం ప్రభుత్వ స్థలాన్ని కారుచౌకగా కొట్టేసిన వైసీపీ
- రూ.50 కోట్ల విలువచేసే భూమికి ఏడాదికి వెయ్యి లీజు చొప్పున 33 ఏళ్లకు కేటాయింపు
- తాడేపల్లిలో అనుమతిలేని వైసీపీ కార్యాలయాన్ని కూల్చివేసిన నేపథ్యంలో ఇక్కడా చర్యలకు డిమాండ్
- వైసీపీ కార్యాలయానికి అనుమతులు లేవన్న విషయం తేలడంతో కుడాలో గుబులు
- తాజాగా ప్రభుత్వం మారినా ఇక్కడ అధికారులు వైసీపీకి అడ్డగోలు సహకారం
- ఏకంగా వీసీ కంప్యూటర్ తెరపై వైసీపీ పేరుతో పలు రహస్య ఫోల్డర్లు
- అటు అక్రమ నిర్మాణానికి నోటీసులు ఇవ్వాల్సి ఉన్నా కార్పొరేషన్ మౌనం

"చేతిలో అధికారం ఉంది.. ఇంకేం.. ఏం చేసినా.. ఎంత అడ్డగోలుగా వ్యవహరించినా అడిగేవారెవరు అనుకున్నారు.. అడ్డుకునే దిక్కేలేదనుకున్నారు.. అంతే.. అనుమతులు, నిబంధనలతో సంబంధం లేకుండా ఏకంగా భారీ భవంతిని నిర్మించేశారు. నగరం నడిబొడ్డున రాజప్రాసాదాన్ని తలపించేలా భవనం కట్టేశారు. ఈ కట్టడం ఉన్న స్థలం విలువ రూ.50 కోట్లకుపైనే. ఇది పూర్తిగా ప్రభుత్వ భూమి.. అయితే కట్టేది అధికార పార్టీకి చెందిన పార్టీ కార్యాలయ భవనం కావడంతో అధికారులు నిలువునా తలూపారు. కళ్లు మూసుకుని జీహుజూర్ అన్నారు. నిబంధనలను తోసిరాజని అడ్డంగా రాసిచ్చేశారు. ఏడాదికి రూపాయి చొప్పున 33 ఏళ్లకు 1.92 ఎకరాలు లీజుకు కట్టబెట్టేశారు. ఇంకేం చకచకా ఏడాదిన్నర వ్యవధిలో వైసీపీ జిల్లా కార్యాలయం సిద్ధమైపోయింది. ఇప్పుడు అధికారం చేయి దాటిపోవడంతో పార్టీ కార్యాలయ భవనం అసలు బండారం బట్టబయలైంది. ఏమాత్రం కాకినాడ నగర అభివృద్ధి సంస్థ (కుడా) అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా దీన్ని నిర్మించినట్టు తేలింది. ఇంకా ప్రారంభోత్సవం కాని ఈ రాజప్రాసాదం పూర్తిగా అక్రమ నిర్మాణమని నిర్ధారణ అయింది. ఈ నేపథ్యంలో అమరావతిలోని తాడేపల్లిలో అనుమతులు లేకుండా నిర్మించిన వైసీపీ కార్యాలయాన్ని ప్రభుత్వం శనివారం కూల్చివేసిన నేపథ్యంలో ఇక్కడా అటువంటి చర్యలు చేపట్టాలనే డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి."

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ నగరంలోని 49వ వార్డు పరిధిలో పైడావారి వీధిలో వైసీపీ తన జిల్లా పార్టీ కార్యాలయాన్ని భారీగా నిర్మించింది. జీప్లస్ వన్ విధానంలో 1.92 ఎకరాల స్థలంలో విలాసవంతంగా నిర్మాణం చేపట్టింది. అధికారం చేతిలో ఉన్న సమయంలో రాజప్రాసాదాన్ని తలపించే రీతిలో నిర్మించారు. అయితే దీనికి ఎలాంటి అనుమతులు లేకపోవడం తాజాగా చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి నగరంలో ఎవరైనా సొంత ఇళ్లు, లేదా వాణిజ్య భవనం, కార్యాలయాలు నిర్మించుకుంటే అనుమతులు కచ్చితంగా తీసుకోవాలి. భవన నిర్మాణ ప్లాన్‌ను అధికారుల ద్వారా ఆమోదింపజేసుకోవాలి. ఇదేదీ లేకుండా నిర్మిస్తే అక్రమ నిర్మాణం అవుతుంది. నోటీసులు ఇచ్చి అధికారులు దీన్ని కూల్చివేసే అవకాశం ఉంది. వాస్తవానికి నగరంలో భవనం నిర్మించే ప్రదేశం 1,200 గజాలలోపు ఉంటే కార్పొరేషన్‌కు, అంతకుమించి దాటితే కాకినాడ నగర అభివృద్ధి సంస్థ(కుడా)కు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలి. అయితే పైడావారి వీధిలో నిర్మించిన జిల్లా వైసీపీ పార్టీ కార్యాలయం 9,355 గజాల్లో నిర్మించారు. దీనికి ప్లాన్ అనుమతులు కుడా నుంచి తీసుకోవాలి. కానీ వైసీపీ మాత్రం అసలు కుడాకు దరఖాస్తే చేయలేదు. చేతిలో అధికారం ఉండడంతో తమకు అనుమతులతో పని లేదనుకున్నారు. దీంతో ప్లాన్ అనుమతులు లేకుండానే ఏకంగా కార్యాలయం నిర్మించేశారు. మొత్తం 1.92 ఎకరాల విస్తీర్ణంలో అడ్డగోలుగా ప్రహరీ గోడ కట్టేశారు. అందులో 1,130 చదరపు మీటర్లలో జీప్లస్ విధానంలో భారీ రాజప్రాసాదం నిర్మించేశారు. ప్రస్తుతం పనులన్నీ 99 శాతం పూర్తయ్యాయి. ఇంకా పార్కింగ్ ఏరియాలో పనులు జరగాల్సి ఉన్న సమయంలో అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. తీరా ఓడిపోవడంతో వైసీపీ దీని ప్రారంభోత్సవాన్ని వాయిదా వేసింది. అయితే ఇప్పుడు అధికారం చేజారిపోవడంతో వైసీపీ నిర్మించిన ఈ జిల్లా కార్యాలయ అడ్డగోలు భాగోతం బయటపడింది. ఏమాత్రం దీనికి నిర్మాణ అనుమతులు లేవని తేలిపోయింది. ఇదే విషయమై కుడా వీసీ కృష్ణమూర్తిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరింది. వైసీపీ నిర్మించిన జిల్లా పార్టీ కార్యాలయానికి అసలు అనుమతులు లేవని ఆయన పేర్కొన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మించిన ఈ భవనం అక్రమ కట్టడమేనని తేల్చారు. పార్టీ కార్యాలయం నిర్మాణానికి అధికారులతో సంబంధం లేకుండా కేవలం మొక్కుబడిగా ఆన్‌లైన్‌లో ఓ దరఖాస్తు పడేసి ఉంచారని తెలిపారు. కానీ కుడా కార్యాలయానికి కూడా రాలేదన్నారు. ఇది పూర్తిగా నిబంధనలకు వ్యతిరేకం నిర్మించిన భవనంగా పేర్కొన్నారు. వాస్తవానికి అమరావతిలోని తాడేపల్లిలో శనివారం ఉదయం జలవనరులశాఖ స్థలంలో అనుమతులు లేకుండా నిర్మించిన వైసీపీ కార్యాలయాన్ని ప్రభుత్వం కూల్చివేసింది. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా పార్టీ కార్యాలయ అనుమతులపై అధికారులను ప్రశ్నించగా, ఇక్కడ కార్యాలయానికి ఏమాత్రం అనుమతులు లేవని అధికారులు నిర్ధారించారు. ఇదేవిషయాన్ని కాకినాడ నగర పాలకసంస్థ డిప్యూటీ చీఫ్ ప్లానర్‌ను వివరణ కోరితే కుడా అధికారులు దీన్ని అక్రమ కట్టడంగా గుర్తించి తమ దృష్టికి తేవాల్సి ఉందన్నారు. కానీ తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. అనుమతులు లేని భవనాలను గుర్తించే విజిలెన్స్ విభాగం కార్పొరేషన్‌దేనని వివరించారు. దీనికి అనుమతులు లేవని తెలియడంతో ఒకటిరెండు రోజుల్లో వైసీపీకి నోటీసులు ఇస్తామని వివరించారు.

రూ.50 కోట్ల విలువైన స్థలం లీజు వెయ్యి రూపాయలట

అధికారపార్టీ తల్చుకుంటే ఏదైనా అడ్డగోలుగా చేయవచ్చు అనేదానికి నిదర్శనమే వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయ నిర్మాణ వ్యవహారం. కొత్త పార్టీ కార్యాలయం నిర్మాణానికి స్థలం కొంటే కోట్లలో ఖర్చవుతుందనే ఉద్దేశంతో కారుచౌకగా వైసీపీ ప్రభుత్వ స్థలాన్ని కొట్టేసింది. ఎలాగూ అధికారంలో ఉంది తామే కాబట్టి అధికారులను అడ్డంగా బెదిరించింది. దారికి తెచ్చుకుని చెప్పిందల్లా చేయించుకుంది. అందులోభాగంగా పైడావారి వీధిలోని సర్వే నెంబరు 155/2/7బీలో ప్రభుత్వానికి చెందిన భూమి ఉంది. ఇందులో 1.92ఎకరాలు జిల్లా వైసీపీ కార్యాలయానికి ఎకరాకు ఏడాదికి వెయ్యి లీజు చొప్పున కేటాయించాలని ఆర్అండ్‌బీ అధికారులు ప్రభుత్వానికి 2023 సెప్టెంబరులో ప్రతిపాదనలు పంపారు. వీటిని ఆగమేఘాలపై ఆమోదించి 1.92ఎకరాల భూమిని వైసీపీకి కేటాయించారు. బహిరంగ మార్కెట్లో ఈ భూమి విలువ రూ.50కోట్లుపైనే పలుకుతోంది. కానీ వైసీపీకి కావడంతో అధికారులు అడ్డంగా మోకరిల్లారు. ఎకరాకు రూపాయి చొప్పున 33ఏళ్లపాటు కేటాయించేశారు. దీంతో యుద్ధప్రాతిపదికన భవనం నిర్మాణం చేపట్టేశారు. వాస్తవానికి ఈ భూకేటాయింపు పూర్తిగా నిబంధనలకు విరుద్ధం. ఏదైనా పార్టీ కార్యాలయానికి భూమిని జిల్లా కేంద్రంలో కేటాయించాలి. కానీ కేటాయించిన స్థలం రమణయ్య పేట పంచాయతీ పరిధిలోనిది. అంటే జిల్లా కేంద్రం పరిధిలోకి రాదు. ఈనేపథ్యంలో ఇటువంటి భూకేటాయింపులు రద్దు చేసే అధికారం ఏ ప్రభుత్వానికైనా ఉంది. పైగా పంచాయతీ పరిధిలోకి వచ్చే ఈ భూకేటాయింపును చేసిన కలెక్టర్‌పైనా చర్యలు తీసుకోవచ్చని చట్టం చెబుతోంది.

ఆ సార్ కంప్యూటర్‌పై వైసీపీ ఫోల్డర్లు...

కుడా, కార్పొరేషన్ కార్యాలయాలకు దగ్గర్లోనే అడ్డగోలుగా జిల్లా వైసీపీ కార్యాలయాన్ని అనుమతులు లేకుండా నిర్మిస్తున్న విషయం కుడా అధికారులకు తెలుసు. కానీ వైసీపీ అధికారంలో ఉండడంతో ఈ విభాగం అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు. ప్లాన్ అనుమతులు లేకుండా ఎవరైనా భవనం నిర్మిస్తే వాలిపోయి జరిమానాలు, కూల్చివేతలు, నోటీసులు అంటూ భయపెట్టే అధికారులు వైసీపీ కార్యాలయ నిర్మాణం అక్రమమని తెలిసి కూడా అటువైపు వెళ్లలేదు. ఒకవేళ వెళ్తే బదిలీ వేటు పడుతుందనే భయంతో కళ్లు మూసేసుకున్నారు. ఇప్పుడు వైసీపీ అధికారంలోంచి తప్పుకోవడంతో అసలు పాపాలు బయట పడుతున్నాయి. దీంతో అధికారులు సైతం తమ తప్పులు ఎక్కడ బయటపడతాయోనని బెంబేలెత్తుతున్నారు. కుడా అధికారులైతే తమ తప్పేంలేదని కార్పొరేషన్ అధికారులదే తప్పు అని తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇక కుడా వైసీపీకి ఎంతలా దాసోహం అయిందంటే ఈ కార్యాలయ వీసీ కంప్యూటర్‌పై వైసీపీ పేరుతో ఏకంగా ఫోల్డర్‌లు ఉన్నాయంటే ఏ స్థాయిలో వీరికి సహకారం అందించారో ఇట్టే అర్థమైపోతోంది. ఎన్నికల్లో వైసీపీ మళ్లీ గెలిచి అధికారంలోకి వస్తుందనే ధీమాతో సదరు కుడా అధికారులు తప్పు మీద తప్పు చేశారు. కార్పొరేషన్ సైతం వైసీపీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కన్నబాబు చెప్పినట్టల్లా తలూపారు.





కొత్త కలెక్టర్ సన్‌మోహన్.. ప్రస్తుత జిల్లా కలెక్టర్ జే నివాస్

కొత్త కలెక్టర్ సన్‌మోహన్

ప్రస్తుత కలెక్టర్ నివాస్‌ను జేఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశం

తూర్పుగోదావరి కలెక్టర్‌గా పి. ప్రశాంతి

కాకినాడ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్త కలెక్టర్‌గా సగిలి సన్‌మోహన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా ఉన్న ఆయనను జిల్లాకు బదిలీ చేసింది. ప్రస్తుత కలెక్టర్ నివాస్‌కు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా జేఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశించింది. కలెక్టర్ నివాస్‌ను అసెంబ్లీ ఎన్నికల్ కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత జిల్లా కలెక్టర్‌గా ఈసీ నియమించింది. అనంతరం అసెంబ్లీ ఎన్నికలను ఈయన ఆధ్వర్యంలో నిర్వహించారు. తాజా ఫలితాల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఐఏస్‌ల బదిలీలను చేపట్టింది. అందులో భాగంగా నివాస్‌ను బదిలీ చేసి ఆయన స్థానంలో కొత్త కలెక్టర్‌గా సగిలి సన్‌మోహన్‌ను శనివారం రాత్రి నియమిస్తూ ఉత్వర్వులు జారీచేసింది. అనంతపురం జిల్లాకు చెందిన సగిలి 2013 ఐఏఎస్‌కు బ్యాచ్‌కు చెందిన అధికారి. స్వస్థలం అనంతపురం జిల్లా అయినా పదో తరగతి వరకు కడప జిల్లాలో విద్యనభ్యసించారు. ఇంటర్ హైదరాబాద్‌లో, రాజస్థాన్‌లోని బిట్స్‌బిలానీలో బీటెక్, అహ్మదాబాద్‌లో ఐఏఎమ్ చదివారు. 2013లో ఐఏఎస్‌కి ఎంపికై ప్రకాశం జిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా విధుల్లో చేరారు. ఆ తర్వాత సీఆర్‌డీఏ అడిషనర్ కమిషనర్‌గా కొన్నాళ్లు పనిచేశారు. అనంతరం చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తూ జిల్లాకు బదిలీపై వస్తున్నారు. కాగా తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా పి. ప్రశాంతి నియమితులయ్యారు. ఈమె పశ్చిమ గోదావరి కలెక్టర్‌గా పనిచేసి కొంతకాలంగా రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా పనిచేస్తూ ఇక్కడికి రాగా, ప్రస్తుత కలెక్టర్ డాక్టర్ కే మాధవీలతకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా జేఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశించారు.





శాసనసభలో ప్రమాణ స్వీకారం చేస్తున్న కొండబాబు.. పవన్‌కల్యాణ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కొండబాబు ప్రమాణస్వీకారం

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు శాలువాతో సత్కారం

కాకినాడ సిటీ, జూన్ 22 : కాకినాడ సిటీ ఎమ్మెల్యేగా వనమాడి కొండబాబు ప్రమాణ స్వీకారం చేశారు. తొలిరోజు అసెంబ్లీకి హాజరుకాకపోవడంతో శనివారం రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో కొండబాబుతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చియచౌదరికి కొండబాబు నమస్కారం చేసి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభివాదం చేశారు. కాగా జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మర్యాదపూర్వకంగా కలిసి గంధం మాలవేసి శాలువతో సత్కరించారు. సిటీ ఎమ్మెల్యేగా తన విజయానికి అందించిన తోడ్పాటుకుగాను పవన్‌కల్యాణ్‌కు కొండబాబు కృతజ్ఞతలు తెలిపారు. పవన్‌కల్యాణ్ కొండబాబును ఆలింగనం చేసుకున్నారు. ఆయనతోపాటు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ ఉన్నారు.

'డయేరియా' టెర్రర్!



పిఠాపురం మండలం కుమారపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద చెత్తాచెదారం పేరుకుపోయిన దృశ్యం

జిల్లాలో డయేరియా కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. వారం వ్యవధిలో ఇద్దరు మరణించగా, 200 మందికిపైగా అస్వస్థతకు గురయ్యారు. రోజురోజుకి కేసుల ఉధృతి పెరగడమే తప్ప తగ్గకపోవడం కలవరానికి గురిచేస్తోంది. అపారిశుధ్యం, కలుషిత తాగునీటి సరఫరా, పైప్‌లైన్ల లీకేజీలు డయేరియా ప్రబలడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీల వద్ద గల నిధులన్నీ లాగేసుకోవడంతో ఏ పనిచేయాలని సొమ్ములు లేని పరిస్థితి నెలకొంది.

- వారం వ్యవధిలో ఇద్దరు మహిళలు మృతి
- 200 మందికి పైగా అస్వస్థత
- జిల్లాలో తగ్గని కేసుల ఉధృతి
- కలుషిత తాగునీరు, అధ్వాన పారిశుధ్యమే కారణం
- గ్రామ పంచాయతీల వద్ద పనుల నిర్వహణకు సొమ్ములు నిల్
- నిధులన్నీ లాగేసుకున్న వైసీపీ సర్కార్

(పిఠాపురం)

జిల్లాలో వాంతులు, విరోచనాలతో బాధపడుతూ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకి అధికమవుతోంది. వైసీపీ ప్రభుత్వ పాలనలో తాగునీటి సరఫరా వ్యవస్థ చిన్నాభిన్నంకావడం, కనీస నిర్వహణ లేకపోవడంతో కుళాయిల ద్వారా కలుషిత జలాలు సరఫరాకావడం, గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్యం పడకేయడం, వాతావరణ మార్పులు ఇందుకు కారణమవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా మరణాలు చోటు చేసుకోవడం అటు అధికార యంత్రాంగాన్ని, ఇటు ప్రజలు కలవరానికి గురిచేస్తోంది. రోజుల తరబడి ఒకే ప్రాంతం నుంచి డయేరియా, అతిసార కేసులు వస్తున్నా అవి నియంత్రణలోకి రావడం లేదు.. సరికదా మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తోంది. తొలుత తొండంగి మండలం కొమ్మనాపల్లిలో వాంతులు, విరోచనాలు బాధపడుతూ డయేరియా కేసులు నమోదయ్యాయి. ఇక్కడ నుంచి ఇదే మండలంలోని బెండపూడికి విస్తరించింది. ఈనెల 12వ తేదిన కేసులు నమోదు కాగా ఇప్పటి వరకూ కొమ్మనాపల్లి గ్రామంలోనే 100మంది డయేరియాతో బాధపడుతూ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరారు. బెండపూడి గ్రామంలో 30కిపైగా కేసులు నమోదయ్యాయి. ఇక్కడ శుక్రవారం ఒక్కరోజే ఏడుగురు కొత్తగా వాంతులు, విరోచనాలతో బాధపడుతూ చికిత్స నిమిత్తం ప్రత్యేక వైద్యశిబిరాలు, కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేరారు. కొమ్మనాపల్లిలో దొడ్డి నాగమణి (30) అనే మహిళ డయేరియాతో మరణించింది. తొండంగి మండలంలో 11రోజులుగా డయేరియా కేసులు వస్తున్నా ఇప్పటికి నియంత్రణ కాలేదు. తాజాగా సామర్లకోట మండలం వేట్లపాలెంలో వాంతులు, విరోచనాలతో బాధపడుతూ కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న కొమ్మోజు సత్యవతి(47) అనే మహిళ శనివారం మరణించింది. ఇదే గ్రామంలో 25 డయేరియా కేసులు నమోదయ్యాయి. గొల్లప్రోలు మండలం దుర్గాడలో అయిదేళ్ల చిన్నారి వాంతులు, విరోచనాలతో బాధపడుతూ చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేరింది. ఇవన్నీ అధికారికంగా నమోదైనవి మాత్రమే. అనధికారికంగా పలువురు వాంతులు, విరోచనాలతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. జిల్లాలో దాదాపు అన్ని మండలాలు, పట్టణాల్లో నిత్యం వాంతులు, విరోచనాలతో బాధపడుతూ చికిత్స నిమిత్తం పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ప్రభుత్వ, ప్రవేటు ఆసుపత్రులకు వస్తున్నారు. వీరిని ఔట్‌పేషెంట్లుగా చికిత్స చేసి పంపివేస్తున్నారు. ఇలా పంపిన వాటిని వైద్యఆరోగ్యశాఖాధికారులు పరిగణలోకి తీసుకోవడం లేదు. కేవలం ప్రత్యేక వైద్యశిబిరాలు, ఆసుపత్రుల్లో ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందుతున్న వారి సంఖ్యనే బయటపెడుతున్నారు. కాగా డయేరియా ప్రబలిన ప్రాంతాల్లో పరిస్థితులను వైద్యఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులపై సమీక్ష జరిపారు. కానీ ఇప్పటివరకూ డయేరియా కేసులు ప్రబలడానికి గల కారణాలను మాత్రం చెప్పలేకపోతున్నారు. గ్రామాల్లో కలుషిత తాగునీటి సరఫరా, పైపులైన్లు లీకేజీలతో మురుగునీరు కుళాయిల ద్వారా వచ్చే నీటిలో కలిసిపోవడం, అధ్వాన్న పారిశుధ్యం, మురికికూపాలుగా మారుతున్న పరిసరాలే కారణంగా చెబుతున్నారు. కొంతకాలంగా గ్రామాలు, పట్టణాల్లో కుళాయిల ద్వారా రంగుమారిన తాగునీరు సరఫరా అవుతోంది. కొమ్మనాపల్లిలో తాగునీటి శాంపిల్స్‌ను పరీక్షించగా నాలుగుచోట్ల నీరు కలుషితమైనట్టు నిర్ధారణైంది. అయితే విషయాన్ని బయటకు రానివ్వకుండా అధికారులు సదరు రిపోర్టులను రహస్యంగా ఉంచుతున్నట్టు విమర్శలు ఉన్నాయి. బెండపూడిలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఇలా డయేరియా వంటివి ప్రబలినప్పుడు సమన్వయంతో పనిచేయాల్సిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటున్నారు. తప్పు అంతా బాధితులదే అన్న రీతిలో వీరు వ్యవహరిస్తున్న తీరు విస్మయాన్ని కలిగిస్తోంది. బెండపూడి, కొమ్మనాపల్లి గ్రామాల్లో రొయ్యలు, ఇతర ఆహార పదార్థాలు తినడం వల్లే వాంతులు, విరోచనాలు వచ్చినట్టు చెబుతున్నారు. అయితే 11 రోజులు గడుస్తున్నా ఇంకా కేసులు వస్తుండడంతో వారు చెబుతున్న వాదన వాస్తవానికి దూరంగా ఉన్నట్టు ఇట్టే అర్థమవుతోంది. తాగునీరు కలుషితమవుతున్నట్టు ఆయా గ్రామాల ప్రజలు బహిరంగంగానే చెబుతున్నా ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు దానికి అంగీకరించడం లేదు. ఆఖరుకి తీసుకున్న శాంపిల్స్‌లో నీరు కలుషితమైనట్టు నివేదిక వచ్చినా వారు తమ తప్పేమి లేదని చెబుతుండడాన్ని పలువురు తప్పుబడుతున్నారు. దుర్గాడలోనూ డయేరియా బారినపడ్డ బాలిక ఆహారం కారణంగానే విరోచనాలు అయినట్టు వైద్యాధికారులు చెప్పడం గమనార్హం.

జిల్లాలో తాగునీటి సరఫరా ఎలా..

జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరా అంతంతమాత్రంగానే ఉంది. ప్రజలకు రక్షిత తాగునీరందడం లేదు. టీడీపీ హయాంలో గ్రామాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్లు మూలనపడ్డాయి. ఎన్టీఆర్ సుజల పథకం ద్వారా 20లీటర్ల మినరల్ వాటర్‌ను కేవలం రెండు రూపాయిలకే అందించేవారు. ఇప్పుడు ఈ ప్లాంట్లు దాదాపు మూతబడ్డాయి. దీంతో పేద, బలహీన, అట్టడుగు వర్గాల ప్రజలు కేవలం కుళాయిల ద్వారా వచ్చే తాగునీటిపైనే ఆధారపడుతున్నారు. తాగునీరు కలుషితం కావడం డయేరియా ప్రబలడానికి కారణమవుతోంది. పట్టణ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. గొల్లప్రోలు, పిఠాపురం పట్టణాల్లోని మంచినీటి కుళాయిలు ద్వారా రంగు మారిన నీరు సరఫరా అవుతోంది. తాగునీరు వాసన వస్తోందని మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా కనీస చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేశారు.

నిధులు మళ్లించేశారు..

గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా దారిమళ్లించేసింది. పంచాయతీలకు వచ్చే ఆర్థికసంఘం, ఇతర నిధులు ద్వారానే తమ పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థకు అత్యవసర మరమ్మతులు నిర్వహించడం, పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టడం చేస్తారు. అయిదేళ్లుగా పంచాయతీల వద్ద ఒక్క రూపాయి లేకుండా వైసీపీ పాలకులు చేయడంతో చిన్న పని చేయడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. ఫలితంగా పైప్‌లైన్ల లీకేజీలు, కుళాయిలకు మరమ్మతులు చేయడం మానివేశారు. దీంతో ఇప్పుడే అదే తాగునీరు కలుషితం కావడానికి కారణమైంది. పంచాయతీలు మరమ్మతులు చేయలేనప్పుడు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆ పనులు చేయించాల్సి ఉంటుంది. వారి వద్ద నిధులు లేకపోవడం, చేసిన పనులకు బిల్లుల చెల్లింపులు జరగకపోవడంతో వారు పనుల నిర్వహణపై దృష్టి పెట్టలేదు. జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు రాష్ట్రంలోనే డయేరియా కేసులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖా మంత్రి పవన్‌కల్యాణ్, ఆరోగ్య, మునిసిపల్ శాఖా మంత్రులు సత్యకుమార్, నారాయణలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ఇతర అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. తక్షణం డయేరియా కేసులు అదుపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం కదలిక కనబడటం లేదు. తక్షణం గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరా పరిస్థితిని సమీక్షించి పైపులైన్ల లీకేజీలు, వాటర్ సప్లై వ్యవస్థలకు అవసరమైన మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపట్టడంతోపాటు పారిశుధ్య నిర్వహణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాల్సిన అవసరం ఉంది. పనుల నిర్వహణకు పంచాయతీలు, పట్టణాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి.

డయేరియా నియంత్రణకు తక్షణమే చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్‌ను ఆదేశించిన ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 22: జిల్లాలో సామర్లకోట మండలం వేట్లపాలెంలో ప్రబలిన డయేరియా నియంత్రణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కలెక్టర్ నివాస్‌ను ఆదేశించారు. శనివారం ఆయన అమరావతి నుంచి ఫోనులో కాకినాడ జిల్లా కలెక్టర్ నివాస్‌తో మాట్లాడారు. వేట్లపాలెంలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. యుద్ధప్రాతిపదికన వేట్లపాలెంలో మెడికల్ క్యాంపు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న డయేరియా రోగులను పరామర్శించి అవసరమైన వైద్యులు సేవలు అందించాలని కలెక్టర్‌కు సూచించారు. ఇప్పటికే వేట్లపాలెంలో డయేరియాతో ఒకరు మృతిచెందగా 25 మంది చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై కార్మికశాఖ మంత్రి సుభాష్ కూడా జిల్లా అధికారులకు ఆదేశాలిచ్చారు.



సత్యవేణి (ఫైల్)



నాగమణి (ఫైల్)

డయేరియాతో మహిళ మృతి

సామర్లకోట, జూన్ 22: సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామానికి చెందిన కొమ్మోజు సత్యవేణి(40) అనే మహిళ డయేరియా బారినపడి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. శుక్రవారం వేట్లపాలెంలో డయేరియాతో అస్వస్థతకు గురై పీహెచ్‌సీలో, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి, ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందింది. అయితే పరిస్థితి విషమించి సత్యవేణి ఆసుపత్రిలోనే మృతి చెందింది. కాగా సత్యవేణి డయేరియాతో మృతిచెందిందన్న సమాచారాన్ని రాజధానిలో ఉన్న ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తన అనుచరుల ద్వారా తెలుసుకుని తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతురాలి కుటుంబాన్ని ఆదుకునేందుకు కృషిచేస్తానని చెప్పారు.

బెండపూడిలో కొనసాగుతున్న వైద్య శిబిరం

తొండంగి, జూన్ 22: డయేరియా బాధితుల కోసం బెండపూడిలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరం కొనసాగుతోంది. శనివారం పది డయేరియా కేసులు నమోదుకాగా వీరిలో ఇద్దరిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఈనెల 18 నుంచి డయేరియా కేసులు ప్రారంభంకాగా ఇప్పటివరకూ 42 కేసులు నమోదుకాగా వీరిలో 25 మందిని కాకినాడ, తుని ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎమ్మెల్యే యనమల దివ్య రోగుల్ని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు. శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంతో సత్వర చికిత్స అందిస్తున్నారు.

పెద్దిరెడ్డి పేషీతో 'షెకావత్' లింకులు


వై.రామవరం మండలంలో అడవిలో చెట్లు నరికి అక్రమంగా నిర్మించిన ప్రైవేటు రహదారి

మారేడుమిల్లి అడవుల్ని అడ్డాగా చేసుకుని టేకు దొంగలకు రాజబాట వేసి అటవీ వినాశనానికి అండగా నిలిచి, అన్నింటా ఆగడాలు, దందా సాగించిన అటవీ ఉన్నతాధికారికి ఏకంగా అప్పటి అటవీ మంత్రి పేషీతోనే లింకులున్నాయి. ఆ అండతోనే టేకు ప్లాంటేషన్లలో వందలాదిగా చెట్లను నరికేసి అక్రమంగా తరలిపోయినా, ఆయన పరిధిలో ఎక్కడ అవకాశం ఉన్నా అక్కడ అక్రమాలు సాగించేయడం ఆయన హయాంలో ప్రహసనంగా సాగింది. గిరిజన రైతుల పట్టా భూముల్లోని టేకు చెట్లకు అనుమతులు, ఎకో టూరిజం ప్రాజెక్టుల నిర్వహణ, అడవిలో రోడ్ల నిర్మాణాలకు అడ్డగోలు అనుమతులు ఇలా అవకాశం ఉన్న ప్రతి వ్యవహారంలోనూ ఆయన, ఆయన బృందం సాగించిన అక్రమాలు కోకొల్లలు.

- ఆ అండతోనే అన్ని విభాగాల్లోనూ అక్రమాలు
- ఆయన భాగోతాలపై విచారణాధికారులుగా ఆయనకు నచ్చిన వారే!
- ప్రభుత్వం మారి పవన్ చేతిలోకి అటవీశాఖ ఉండటంతో ఆందోళన

(ఆంధ్రజ్యోతి-అమరావతి)

అల్లూరి జిల్లా రంపచోడవరం అటవీ డివిజన్లో గత ప్రభుత్వ తీరుకు అనుగుణంగా పలు అక్రమాలు జరిగాయి. గిరిజనులు పోడు వ్యవసాయం సాగిస్తే తీవ్ర నేరంగా పరిగణించే వ్యవస్థలో అటవీ కార్యక్రమాల ముసుగులో అక్రమాలకు తెరలేపేశారు. ముఖ్యంగా వచ్చేది ఎలాగూ తమ ప్రభుత్వమే అనుకున్నారో ఏమోగానీ ఎన్నికల కోడ్ అమలులో ఉండగానే అన్నీ చక్కబెట్టేశారు. గిరిజన రైతుల పట్టా భూములలో ఉండే టేకుచెట్ల నరికివేత, వాటి రవాణాకు సంబంధించిన ఫైళ్ల నిర్వహణతో సదరు అధికారి కార్యాలయం రచ్చకెక్కింది. దీంతో ఓ బాధితుడి ఫిర్యాదుతో ఆయన టార్గెట్‌గా ఏసీబీ అధికారులు దాడి చేయగా ఆ కార్యాలయంలోని ఓ రేంజ్ అధికారి దొరికిపోయారు. తర్వాత క్రమంలో మారేడుమిల్లి రేంజ్ పరిధిలోని టేకు ప్లాంటేషన్లలోని సుమారుగా 378 టేకు చెట్ల నరికివేత రాష్ట్రంలోనే సంచలనంగా మారి వరుసగా మీడియాలో షెకావత్ లీలలన్నీ వెలుగు చూశాయి. ఈ బాగోతాలన్నిటిపైనా పీసీసీఎఫ్ కార్యాలయం విచారణకు ఆదేశిస్తే శాఖలో షెకావత్‌కు నచ్చిన అధికారులనే విచారణాధికారులుగా నియమించారు. దీంతో విచారణను మొక్కుబడిగా సాగించి నరికివేయబడిన చెట్ల లెక్కలను మాత్రం తేల్చి, దిగువ స్థాయి అధికారులపై చర్యలు తీసుకుని వదిలేశారన్న విమర్శలు శాఖలోనే వినిపిస్తున్నాయి. ఎక్కడైనా అక్రమాలు జరిగితే ఆరోపణలను ఎదుర్కొంటున్న అధికారులను అక్కడి నుంచి తప్పించి విచారణ జరపడం రివాజు. కానీ ఇక్కడ మాత్రం సదరు అధికారి కనుసన్నలలోనే విచారణ జరిపిన పరిస్థితులు నెలకొన్నాయి. అక్రమ టేకు చెట్ల నరికివేత వ్యవహారంలో పోలీసు ఫిర్యాదుచేసి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించి దర్యాప్తు సాగించాలని ఇచ్చిన ఆదేశాలు కూడా గాలికొదిలేశారు. ఈ టేకు చెట్ల వ్యవహారం సాగుతుండగానే మారేడుమిల్లి రేంజ్ పరిధిలో నడుస్తున్న ఎకో టూరిజం ప్రాజెక్టులలో కూడా అనేక అక్రమాలు వెలుగు చూశాయి. కమిటీలు లేకుండానే కార్యకలాపాలు సాగించడం, నిధులను డ్రా చేయడం, నిబంధనలకు విరుద్ధంగా వాటి నిధులను తమ నివాసాల కోసం వెచ్చించడం వంటి బాగోతాలపై విచారణ సాగుతున్నా అది కూడా ఆయన కనుసన్నలలోనే సాగుతోందన్న విమర్శలూ ఉన్నాయి. కాగా కొద్ది రోజుల క్రితం ప్రభుత్వం మారడంతో పర్యావరణాన్ని కాంక్షించే కొందరు ఈ వ్యవహారాలపై ధైర్యంగా ముందుకు వచ్చారు. గతంలో టేకు చెట్ల నరికివేత వ్యవహారంలో విచారణ నిర్వహించిన అధికారులకే ఎకో టూరిజం విచారణ అప్పగించడంపై కొందరు నేరుగా సీసీఎఫ్‌ను కలిసి కొందరు డీఎఫ్‌వోల వల్ల విచారణ పక్కదారి పడుతోందని, వారిని తప్పించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించడంతో ఇద్దరు డీఎఫ్‌వోలను తప్పించి ఎకో టూరిజం విజిలెన్స్ డీఎఫ్‌వో ఒకరికి అప్పగించారు. ప్రస్తుతం ఆయన ఈ విచారణను సాగిస్తుండగా ఆయనపై కూడా సదరు అధికారి ప్రభావం చూపాలని ప్రయత్నిస్తున్నా ఫలితం లేకపోయింది. ఇదిలాఉండగా అటవీ ప్రాంతం మీదుగా వెళ్లే అనేక రోడ్ల నిర్మాణాలకు కూడా ఆయా కాంట్రాక్టర్ల ప్రయోజనం కోసం అడ్డగోలు అనుమతులు ఇచ్చారన్న ఆరోపణలూ ఉన్నాయి. వై.రామవరం మండలంలో తాడికొండ అటవీ ప్రాంతంలో వైసీపీ అండతో ఓ వ్యక్తి పెద్ద ఎత్తున అటవీ వినాశనానికి పాల్పడి తన భూముల కోసం రహదారి నిర్మిస్తే మొక్కుబడి చర్యలతో ప్రోత్సహించారు. స్థానిక వైసీపీ ఎమ్మెల్సీ, ఇతర కేంద్ర సర్వీసుల అధికారుల అండతో పాటు అటవీ మంత్రి పేషీతో ఉన్న లింకులతో ఈయనకు ఎదురు నిలిచేవారే లేకుండా పోయారు. ఇక్కడ బాగోతాల వాస్తవాలను నివేదించిన ఓ అధికారి నివేదించిన తీరు ఉన్నతాధికారులకు తెలిసినా స్పందించలేదు. కాగా తీవ్రత లేకుండా ఓ నివేదికను ప్రభుత్వానికి పంపించగా ఎలాగూ వచ్చేది తమ ప్రభుత్వమే అన్న ధీమాతో ఎన్నికలు దాటాకా దాని సంగతి చూసుకుందామనుకుంటే రాష్ట్రంలో పాలనా పగ్గాలే మారిపోయాయి. అందునా అటవీశాఖ బాధ్యతలు పవన్‌కల్యాణ్ తీసుకోవడంతో వైసీపీ నాయకులతో అంటకాగిన ఇక్కడి అక్రమాల అధికార బృందానికి చెమటలు పడుతున్నాయి. ముఖ్యంగా ఎవర్ని నమ్మి ఇంతకాలం యథేచ్ఛగా అక్రమాలను కొనసాగించారో ఆయా ఉన్నతాధికారులు సైతం చేతులెత్తేశారు. తనకు అండగా నిలిచే వారి పరిస్థితులే ప్రతికూలంగా మారిన సందర్భం షెకావత్ బృందాన్ని షేక్ చేస్తోంది. ఏం జరుగుతుందో ఇక చూడాలి మరి.

రంపచోడవరంలో ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ పర్యటన

రంపచోడవరం, జూన్ 22: రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు చిరంజీవిచౌదరి శనివారం రంపచోడవరం డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అటవీశాఖ ద్వారా చేపట్టిన పనులను పరిశీలించారు. ఇటీవల మారేడుమిల్లి రేంజ్ పరిధిలో చోటుచేసుకున్న టేకు అక్రమ కలప నరికివేత తదితర అక్రమాలపై జరిగిన విచారణ తదనంతరం ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఆయన పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది.


పాపికొండ అభయారణ్యంను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో చీఫ్ కన్సర్వేటర్


బాలబాలాజీ దర్శనానికి బారులు తీరిన భక్తులు

అప్పనపల్లికి భక్తుల తాకిడి

మామిడికుదురు, జూన్ 22: అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి భక్తులు వైనతేయ నదిలో స్నానమాచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. శనివారం స్వామివారిని 3271 మంది దర్శించుకుని, 2084 మంది నిత్యాన్నదాన పథకంలో భోజనాలు చేశారని, వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,99,163 ఆదాయంగా వచ్చిందని సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బంది తలెత్తకుండా సిబ్బంది ఏర్పాట్లు చేశారు. అలాగే బాలబాలాజీ దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి కైకలూరుకు చెందిన పెన్మెత్స మణికంఠ కృష్ణంరాజు-స్వాతి దంపతులు రూ.10వేలు విరాళంగా అందించారు. తమ కుమారుడు క్రిటిన్‌వేదాంతవర్మ పుట్టినరోజు డిసెంబరు 1వ తేదీ ప్రతీ సంవత్సరం అన్నదానం జరిపించాలని ఈ విరాళం అందించినట్టు సహాయ కమిషనర్ మాధవి తెలిపారు. విరాళమందించిన దాతకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందించారు.

శృంగారవల్లభస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు


శృంగారవల్లభస్వామి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

పెద్దాపురం, జూన్ 22: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధికసంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,14,700 అన్నదాన విరాళాలు రూ.65,742 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.7,560, తులాభారం రూ.300, లడ్డూ ప్రసాదం ద్వారా 26,835, వెరసి రూ.3,15,137 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 12వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం అర్చకుడు పెద్దింటి నారాయణాచార్యులు పాల్గొన్నారు.

సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి
రూ.2 లక్షలు విరాళాలు


చైర్మన్‌కు విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, జూన్ 22: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి శనివారం ఇద్దరు దాతల నుంచి రెండు లక్షలు విరాళం గా సమకూరాయి. అన్నవరానికి చెందిన కొంతం సతీష్, మణికంఠలు రూ.1,01,116లు దేవస్థానం చైర్మన్ ఐ.వి.రోహిత్‌కు అందజేయగా దాతను ఆయన అభినందించారు. ము మ్మిడివరానికి చెందిన మరో దాత చింతలపూడి బాలకృష్ణ, పోలావతి దంపతులు రూ.లక్ష పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. వారికి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

24 నుంచి కుమార రామ భీమేశ్వరాలయంలో
అభిషేకాలకు అనుమతులు మంజూరు

సామర్లకోట, జూన్ 22:పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఇటీవల శివలింగ జీర్ణోద్ధారణ పనులు అనంతరం ఈనెల 24 సోమవారం నుంచి శివలింగంపై అభిషేకాలకు భారతీయ పురావస్తు శాఖ అధికారులు (న్యూఢిల్లీ) నుంచి అనుమతులు మంజూరయ్యాయని ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం శనివారం సాయంత్రం తెలిపారు. గతనెల 28 నుంచి శివలింగ జీర్ణోద్ధారణ చర్యల కారణంగా మూలవిరాట్ దర్శనం నిలిపివేసిన విషయం విదితమే. గత వారం నుంచి స్వామివారి మూలవిరాట్ పూజా కైంకర్యాలు, దర్శనాలు అనుమతించగా శివలింగంపై అభిషేకాలకు మాత్రం అనుమతులు ఇవ్వలేదు. పలువురు భక్తుల నుంచి వచ్చిన విజ్ఞాపనల మేరకు భారతీయ పురావస్తుశాఖ ఉన్నతాధికారులు స్పందించి శివలింగంపై అభిషేకాలకు అనుమతులు మంజూరు చేశారు. ఈనెల 24 సోమవారం నుంచి యథావిధిగా స్వామివారికి అభిషేకాలు కొనసాగిస్తామని భక్తులు గమనించి స్వామివారిని దర్శించి స్వామి కృపకు పాత్రులు కాగలరని ఈవో నీలకంఠం తెలిపారు.

శనేశ్వరాలయానికి భక్తుల రద్దీ

కొత్తపేట, జూన్ 22: మందపల్లి మందేశ్వర (శనేశ్వర) స్వామి ఆలయానికి శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. స్వామివారి సర్వదర్శనాల అనంతరం తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.2,22,210 ఒకరోజు ఆదాయం సమకూరినట్టు సహాయ కమిషనర్, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు.


శనేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అడ్రస్సు అడిగారు.. గొలుసు దోచేశారు..

గొల్లప్రోలు రూరల్, జూన్ 22: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండంలోని చేబ్రోలు ఓ మహిళ మెడలోని బంగారం గొలుసును దుండగులు లాక్కెళ్లిపోయారు. ఆమె పోలీసులను ఆశ్రయించడంతో విచారణ చేపట్టారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. చేబ్రోలులోని హరేరామ ఆలయంవద్ద శనివారం మధ్యాహ్నం 3గంటల సమయంలో కత్తిపూడి వెళ్లేందుకు పేరూరి లక్ష్మి అనే మహిళ ఆటో కోసం నిలబడింది. ఇంతలో ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి ఆమెను అడ్రస్సు అడిగినట్టే అడుగుతూ మెడలో బంగారం గొలుసు లాక్కెళ్లిపోయారు. ఇంతలో మహిళ గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకుని దుండగులను వెంబడించినా దొరకలేదు. దాంతో ఆమె భర్త త్రిమూర్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆ ప్రాంతంలోని సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.

ప్రజలకు మేలు చేసే ప్రభుత్వం వచ్చింది

- వైసీపీ పాలనలో అన్నిరంగాలు నిర్వీర్యం
- రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారింది
- ప్రతిపక్షం అనేది చట్టసభల్లో ప్రజల పక్షాన నిలబడాలి
- శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

తుని రూరల్, జూన్ 22: దోచుకునే ప్రభుత్వం పోయి ప్రజలకు మేలు చేసే ప్రభుత్వం వచ్చిందని శాసన మండలి ప్రతిపక్ష నేత, మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. కాకినాడజిల్లా తుని రూరల్ మండలం తేటగుంట టీడీపీ కార్యాలయంలో విలేఖరులతో యనమల మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వ్యవస్థలన్నింటినీ భ్రష్టు పట్టించి దాచుకోవడం దోచుకోవడమే లక్ష్యంగా పనిచేశారని వారికి అధికార యంత్రాంగం వత్తాసు పాడిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సమర్థవంతంగా జరగాలంటే వ్యవస్థలను బాగు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంద న్నారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ దెబ్బతిందని వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. రాష్ట్రంలో కొలువుదీరిన ఎన్డీయే ప్రభుత్వ ఎన్నో సవాళ్లను ఎదుర్కొనే పరిస్థితి నెలకొందని, రాష్ట్ర ప్రజలకు మేలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు వాటన్నింటినీ అధిగమించి చంద్రబాబు మంచి పాలన అందిస్తారన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఏ పేదరికం తొలగలేదని, అసమానతలు పెరిగిపోయాయన్నారు. వ్యవస్థలు సరైన మార్గంలో లేకపోవడంతో అవినీతి, అక్రమాలే రాజ్యమేలుతాయని జగన్ సర్కార్ రాజ్యాంగాన్ని సైతం అపహాసం చేసిందన్నారు. ప్రతిపక్షం అనేది సక్రమంగా చేసి చట్ట సభల్లో ప్రజలకు మేలు చేసేలా పాటుపడాలని తెలిపారు. జగన్ విధ్వంస పాలనలో విసుగు చెందిన రాష్ట్ర ప్రజలు ఎన్డీయే ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారు. ప్రజాస్వామ్యంలో బలమైన పాత్ర పోషించేది మీడియా గొంతు నొక్కేందుకు వైసీపీ ప్రభుత్వం ప్రయత్నించిందని జగన్ సొంత ఛానల్స్‌లో అసత్యాలు ప్రచారంచేసి ప్రజలను తప్పుదోవ పట్టించాలనుకున్నారు.

అయ్యన్నకు యనమల శుభాకాంక్షలు

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుకి శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణ, తుని ఎమ్మెల్యే యనమల దివ్య శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ నేత అయిన అయ్యన్నను స్పీకర్ పదవికి టీడీపీ ఎంపిక చేసి సముచిత స్థానం కల్పించిందని యనమల అన్నారు. శాసన సభ అయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కొత్త సభకు కృతజ్ఞతలు తెలిపి స్పీకర్ అయ్యన్నకు శుభాకాంక్షలు తెలిపారు. అయ్యన్నపాత్రుడు సమర్థవంతంగా సభను నిర్వహిస్తారని సభా, సంప్రదాయాలకు అనుగుణంగా నూతన ఒరవడిని తీసుకొస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి

సామర్లకోట, జూన్ 22: కాకినాడ జిల్లా సామర్లకోట భీమవరపుపేటకు చెందిన చింతాడ నరసింహం(29) అనే వ్యక్తి తన ఇంటిలోనే శనివారం విద్యుత్ ఘాత ంతో మృతి చెందాడు. సామర్లకోట మున్సిపల్ వాటర్ వర్క్స్‌లో పనిచేస్తున్న నరసింహం రోజూలాగే విధుల కు హాజరయ్యేందుకు బట్టలు వేసుకుంటూ టీడీ స్విచ్‌ఆన్ చేయగా ప్లగ్ నుంచి విద్యుత్ ప్రవహించి శరీరానికి తాకింది. దీంతో అపస్మారక స్థితిలోకి చేరాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినప్పటికీ పరీక్షించిన వైద్యులు నరసింహం మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పశువుల రవాణాను అడ్డుకున్న పోలీసులు


పశువులను అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

సామర్లకోట, జూన్ 22: పిఠాపురం నుంచి హైదరాబాద్‌కు ఒక మినీ వ్యాన్‌లో అక్రమంగా 28 గేదె దూడలను రవాణా చేస్తున్నారన్న నేరంపై అక్రమ రవాణాదారులు ఇద్దరు వ్యక్తులపై సామర్లకోట పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేశారు. పశువుల వధశాలకు తరలిస్తున్నారన్న సమాచారంతో సామర్లకోట శివారున పోలీసులు ఈ తనిఖీలు నిర్వహించారు. 28 దూడలను, రవాణాకు వినియోగించిన మినీ వ్యాన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

8 మంది 'నన్నయ' ఆచార్యులకు రూస ప్రాజెక్టులు


నన్నయ ఆచార్యులకు రూస ప్రాజెక్టు పత్రాలను అందజేసిన వీసీ

దివాన్‌చెరువు, జూన్ 22: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని ఎనిమిది మంది ఆచార్యులకు రాష్ట్రీయ ఉచ్చ తర్ శిక్షా అభియాన్ (రూస) ద్వారా ప్రాజెక్టులు మంజూరయ్యాయని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. విశ్వవిద్యాలయంలో సంబంధితులకు ప్రాజెక్టు పత్రాలను శనివారం వీసీ అందజేసి అభినందించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ యూనివర్శిటీ ఆర్ట్స్, కామర్స్ కళాశాలలోని ఆంగ్ల విభాగానికి చెందిన ఆచార్య కె.శ్రీరమేష్, ఎస్.సజన్‌రాజ్‌లకు, సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలోని ఆచార్య వై.శ్రీనివాసరావు, ఆచార్య కేవీ స్వామి, ఆచార్య డి.కళ్యాణి, కె.నూకరత్నం, ఎ.మట్టారెడ్డి, పి.విజయనిర్మలకు ప్రాజెక్టులు మంజూరయ్యాయన్నారు. రూస నిధులతో నిర్వహించే ఈ ప్రాజెక్టులను సమర్థవంతంగా పూర్తిచేసి కొత్త విషయాలను సమాజానికి అందించాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పాల్గొన్నారు.

యోగా కాన్షియస్ ట్రస్ట్‌తో 'నన్నయ' ఎంవోయూ

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, సెంటర్స్ ఆఫ్ యోగా కాన్షియస్ ట్రస్ట్(వైసీటీ) గోదావరిశాఖ కానవరంలోని శ్రీరాపర్తి రామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా మధ్య అవగాహన ఒప్పందాన్ని తిరిగి ప్రారంభించామని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. విశ్వవిద్యాలయంలో శనివారం ఎంఓయూ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ సుధాకర్, శ్రీరాపర్తి రామ యోగా సంస్థ కార్యదర్శి ఎంవీజీఎస్ శర్మ ఎంవోయూలపై సంతకాలుచేసి పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వైసీటీ, నన్నయవర్శిటీ మధ్య ఎంవోయూ తిరిగి ప్రారంభించామని, విద్య పరిశోధనలను ప్రోత్సహించడానికి సంయుక్తంగా పనిచేస్తామన్నారు. సంస్థ సహకారంతో పీజీ డిప్లమో ఇన్ యోగా కోర్సును అందిస్తున్నామని, అందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, డీన్ ఆచార్య పి.సురేష్ వర్మ పాల్గొన్నారు.


యోగా ఎంవోయూ పత్రాలను పరస్పరం మార్చుకుంటున్న అధికారులు

గోదావరిలో మునిగి బాలుడు మృతి

- మరో ఇద్దరిని రక్షించిన స్థానికులు
- ప్రమాద స్థలాన్ని సందర్శించిన కలెక్టర్

భద్రాచలం, జూన్ 22: భద్రాచలం వద్ద శనివారం గోదావరిలో మునిగి అంగులూరి కార్తీక్(11) అనే బాలుడు మృతి చెందాడు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నంలోని శ్రీరామనగర్ కాలనీలో వివాహ వేడుకకు హాజరైన ఏపీలోని ఏలూరు మండలం మాదేపల్లి, ఖమ్మం నగరానికి చెందిన కుటుంబాల సభ్యుల్లోని పలువురు గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో కత్తుల ఏడుకొండలు, బొజ్జా తాండవ కృష్ణ, కార్తీక్, మల్లికార్జున్, రాము నదిలో స్నానం చేసేందుకు దిగారు. ఈ క్రమంలో ఏడు కొండలు, తాండవ స్నానం ముగించుకొని ఒడ్డుకు చేరగా కార్తీక్, మల్లికార్జున్, రాము స్నానం చేస్తూ నది లోతును అంచనా వేయలేక నీటిలో మునిగిపోయారు. దీంతో వీరి అరుపులు విన్న గజ ఈతగాళ్లు నదిలోకి దిగి మల్లికార్జున్, రాములను ఒడ్డుకు చేర్చారు. గల్లంతైన కార్తీక్(11)కోసం గాలించగా మృతదేహం లభ్యమై ంది. ప్రాణాలతో బయటపడ్డ మల్లికార్జున్‌కు భద్రా చలంలో ని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలుస్తోంది. ఈ ఘటన విషయం తెలుసుకున్న భద్రాచలం ఎస్‌ఐ విజయలక్ష్మి అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. బాధితుల నుంచి వివరాలు తెలుసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


భద్రాచలం వద్ద గోదావరిలో మునిగి మృతి చెందిన కార్తీక్

ప్రమాదాలు జరుగకుండా నిరంతర నిఘా

- భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

భద్రాచలం వద్ద గోదావరి పరిసరాల్లో ఇకపై ఎటువంటి ప్రమాదాలు జరగకుండా నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. నదిలో మునిగి బాలుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న కలెక్టర్ భద్రాచంలోని గోదావరి స్నాన ఘట్టాల వద్దకు చేరుకొని స్థానిక అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదావరినది ఒడ్డున ప్రమాద సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే నది లోతు గురించి సమాచారం తెలిపేలా ప్రత్యేక సిబ్బందిని నియమించాలని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు, నీటిపారుదలశాఖ ఈఈ రాంప్రసాద్, భద్రాచలం సీఐ సంజీవరావు పాల్గొన్నారు.

సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు పాటించాలి

- ఆరోగ్యకరమైన ఆహారం అందించాలి
- ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా

పిఠాపురం, జూన్ 22 : పంటల సాగులో సేంద్రీయ వ్యవసాయ పద్ధతు లు పాటించడం ద్వారా ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందజేయాలని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా సూచించారు. ఏరువాక పౌర్ణమి, రైతు సస్యవృద్ధి బీజారోపణ ఉత్సవం కార్యక్రమంలో భా గంగా శనివారం కాకినాడజిల్లా పిఠాపురం పట్టణ శివారులోని పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలోని వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయశాస్త్రవేత్తలతో కలిసి పీఠాధిపతి నాగలి పట్టి దుక్కుదున్నారు. పకృతిసిద్ధంగా వ్యవసాయం చేయడం వలన భూసారం పరిరక్షింపబడుతుందని, తద్వారా లాభదాయకమైన ఫలసాయం పొందాలని చెప్పారు. అనంతరం ఆశ్రమ ప్రాంగణంలో నిర్వహించిన పకృతి, సేంద్రీయ వ్యవసాయ సదస్సును ఆయ న జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. తెలంగాణా రాష్ట్రం రాజేంద్రనగర్‌లోని అగ్రానమి ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఏవీ రామాంజనేయులు, ఎంటమాలజీ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్.రామగోపాలవర్మ, డాక్టర్ నీలిమ, డాక్టర్ రత్నప్రశాంతి, సీహెచ్ సత్యనారాయణ, అరుణ, అహ్మద్ ఆలీషా, ఏవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉత్తమ రైతులుగా ఎంపికచేసిన సన్నిబోయిన నాగూరు అప్పారావు, పాఠంశెట్టి గోవిందు, ఆకుల వీర్రాజు, శీరం గంగరాజు, శీరెడ్డి పార్వతి, ఆదివిష్ణులను సత్కరించారు.



పిఠాపురంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా నాగలి పట్టి పొలంలో దున్నుతున్న పీఠాధిపతి ఉమర్‌ఆలీషా, ఉత్తమ రైతులను సత్కరిస్తున్న పీఠాధిపతి

రేపటి నుంచి 'డయల్ యువర్ కమిషనర్'

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 22: ప్రభుత్వ ఉత్తర్వులు అనుసరించి సోమవారం నుంచి కాకినాడ నగరపాలక సంస్థ మీటింగ్ హాల్ నందు ఉదయం 9.30గంటల నుంచి 10.30గంటల వరకు డయల్ యువర్ కమిషనర్, తదుపరి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. సూపరింటెండెంట్లు, విభాగాధిపతులు, 101 సచివాలయ సిబ్బంది తప్పక హాజరుకావాలన్నారు.

హోం మంత్రి అనితకు సత్కారం


హోం మంత్రిని సత్కరిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, జూన్ 22: రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను శనివారం విజయవాడలో కాకినాడ జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లాబత్తుల అప్పారావు, ఇతర నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా, కాకినాడ రూరల్ టీడీపీ సమన్వయకర్త కటకంశెట్టి బాబి ఉన్నారు. అలాగే రాష్ట్ర మంత్రి వాసం శెట్టి సుభాష్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజును టీడీపీ నాయకులు కొల్లాబత్తుల అప్పారావు, బంగారు సత్యనారాయణ, కౌజు నెహ్రూ తదితరులు కలిసి ఘనంగా సత్కరించారు.

డిప్యూటీ సీఎం పవన్‌ను సత్కరించిన నవీన్

జగ్గంపేట, జూన్ 22: అమరావతిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, జగ్గంపేట తెలుగు యువత అధ్యక్షుడు, తామరాడ మాజీ సర్పంచ్ అనుకూల శ్రీకాంత్ ఉన్నారు.

ఎమ్మెల్యే నానాజీకి శుభాకాంక్షలు

కరప, జూన్ 22: కాకినాడరూరల్ ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన పంతం నానాజీని మండలం నుంచి పలువురు జనసేన నాయకులు విజయవాడ వెళ్లి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. యండమూరు సర్పంచ్ మారెళ్ల శివ నానాజీని కలిసి పుష్పగుచ్ఛాలు, శాలువా కప్పి అభినందనలు తెలిపారు. టీడీపీ కాకినాడరూరల్ కో కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్(బాబి) నానాజీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్చాలి : సీడీపీవో

కరప, జూన్ 22: తల్లిదండ్రులు మూడేళ్లు నిండిన తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ కాకినాడ రూరల్ ప్రాజెక్టు సీడీపీవో వై.లక్ష్మి సూచించారు. కొంగోడులో అంగన్‌వాడీ పిలుస్తోంది రా..కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి పసుపు కుంకుమ, గాజులు, నూతన వస్త్రాలు అందజేశారు. బాలింతలకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి చిన్నారులకు పట్టాలిచ్చారు. సర్పంచ్ నక్కా అప్పలస్వామి, మాజీ సర్పంచ్ మేడిశెట్టి సుబ్బరాజు, మాజీ ఎంపీటీసీ ఆట్ల గోవిందరాజులు, ఉపసర్పంచ్ వనుం నారాయణరావు, సెక్టార్ సూపర్‌వైజర్‌లు కె.విజయలక్ష్మి, కె.అన్నపూర్ణ ఉన్నారు.

'పీవోడబ్ల్యూ పాత్ర కీలకం'

పెద్దాపురం, జూన్ 22: వీరోచిత పోరాటాల్లో పీవోడబ్ల్యూ పాత్ర ఎంతో కీలకం అని రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. మండలంలోని పులిమేరులో పీవో డబ్ల్యూ 50 వార్షికోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ మహిళల హక్కుల కోసం పోరాటం చేసిన సంఘం స్త్రీవిముక్తి సంఘం అన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళలంతా ఏకతాటిపైకి వచ్చి తమ సాధికారత కోసం ఉద్యమించాలన్నారు. బచ్చుల రాఘవమ్మ, ధనలక్ష్మి, లక్ష్మమ్మ, దేశెట్టి సురేష్ పాల్గొన్నారు.

'గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలి'

కిర్లంపూడి, జూన్ 22: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని ఎంపీడీవో బడే రాజేశ్వరరావు అన్నారు. శనివారం ఎంపీడీవో, పంచాయతీ విస్తరణాధికారి ఎస్.సత్యప్రసాద్ మండలంలోని రాజుపాలెం, రామకృష్ణాపురం గ్రామ సచివాలయాల పరిధిలోని మంచినీటి వనరులను పరిశీలించారు. మంచినీటి వనరుల శుభ్రత, క్లోరినేషన్ అండ్ టెస్టింగ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజానీకానికి నాణ్యమైన నీటిని అందించాలని ఆయా కార్యదర్శులు లోవకుమారి, సతీష్‌ను ఆదేశించారు.

వాటర్ ట్యాంక్‌ల శుభ్రం

కరప, జూన్ 22: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మండల అధికారులు ఆయా గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంక్‌లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు జారీచేశారు. డయేరియా కేసులు ప్రబలతున్న దృష్ట్యా సురక్షిత మంచినీటిని ప్రజలకు అందించాలని ఎంపీడీవో కొంకి అప్పారావు సూచించారు. వేళంగి, వాకాడ గ్రామాల్లో పర్యటించి ట్యాంక్‌ల క్లీనింగ్, క్లోరినేషన్ చేయించారు. పెనుగుదురు, గొర్రిపూడిలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వి.వర్ధన్ పర్యటించి క్లోరినేషన్, క్లీనింగ్ పనులను తనిఖీచేశారు. కార్యదర్శులు పబ్బినీడి శ్రీనివాసరావు, పినిశెట్టి వీరభద్రరావు, చంద్రకళ తదితరులున్నారు.

'క్వారీలపై చర్యలు తీసుకోవాలి'

రౌతులపూడి, జూన్ 22: మండలంలో ఎస్.పైడిపాల, తిరుపత్మపేట, మూలగపూడి, బంగారయ్యపేట, ఉప్పంపాలెం గ్రామాల్లో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న క్వారీలపై చర్యలు తీసుకోవాలని సుర్ల శ్రీనివాస్, నేతల కొండబాబు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విచ్చలవిడిగా తవ్వకాలు జరిపి పెద్దపెద్ద బండరాళ్లను తరలిస్తున్నారని, దీంతో రహదారులు ఛిద్రమవుతునట్టు తెలిపారు. క్వారీల నిర్వహణ వల్ల పర్యావరణం దెబ్బ తింటుందని, ఇప్పటికైనా అక్రమ క్వారీ తవ్వకాలను అడ్డుకోవాలని వారు కోరారు.

'ఒత్తిడి చేసి రాజీనామా చేయించారు'

గొల్లప్రోలు రూరల్, జూన్ 22: ఒత్తిడి చేసి తమతో బలవంతంగా రాజీనామా చేయించారని పిఠాపురం నియోజకవర్గానికి చెందిన పలువురు వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని చేబ్రోలులో జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. వైసీపీ నేతల ఒత్తిడి వల్ల రాజీనామా చేసిన తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

వైభవంగా పార్వతీ కల్యాణం

తొండంగి, జూన్ 22: ఏ.కొత్తపల్లి కదంబ క్షేత్ర 13 వార్షికోత్సవం సందర్భంగా శనివారం పార్వతీ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. క్షేత్రంలో భువనేశ్వరి సహిత విజయేశ్వరుని ఆలయాన్ని సర్వాంగసుందరంగా అలంకిరించారు. ఉన్నత వేదికపై స్వామి,అమ్మవార్లను ఉంచి వేదమమంత్రాలతో కల్యాణ క్రతువును అర్చకులు నిర్వహించారు.అంతకుముందు పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాన్ని జరిపారు. అర్చకులు చిట్టెం వేణుశర్మ, క్షేత్ర నిర్వాహకులు భూమానంద భారతి ఉన్నారు.

280 లీటర్ల సారా, ట్రక్కు ఆటో స్వాధీనం

ప్రత్తిపాడు, జూన్ 22: ప్రత్తిపాడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది శనివారం కాకినాడ ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ కె.శ్రీలక్ష్మి ఆదేశాల మేరకు మాసంపల్లి గ్రామంలో దాడులు నిర్వహించారు. 280లీటర్ల నాటుసారాను ట్రక్కు ఆటోలో రవాణా చేస్తుండగా పట్టుకున్నారు. సారా రవాణా చేస్తున్న రౌతులపూడి మండలం పల్లపు చామవరానికి చెందిన గొరకపూడి సురేష్‌ను అరెస్ట్ చేశారు. సారా తయారీదారుడు వెలుగుల శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఈబీ సీఐ ఎల్.చిరంజీవి తెలిపారు. ఎస్ఐ ఎం.ఆశలత, సిబ్బంది కృష్ణార్జునరావు, వీరభద్రరావు, దొరబాబు, రాజు ఉన్నారు.

ట్యాక్స్ కట్టని 6 వాహనాలు సీజ్

రౌతులపూడి, జూన్ 22: ట్యాక్స్ కట్టని ఆరు వాహనాలను సీజ్ చేసి 3లక్షల 25 వేల రూపాయిలు అపరాధ రుసుం వేసినట్టు కత్తిపూడి ఎమ్‌విఐ బి.శ్రీనివాస్ తెలిపారు. కత్తిపూడి పరిధిలో వాహనాలను తనిఖీ చేశారు. ఢిల్లి నుంచి కొనుగోలు చేసి 15 నెలలుగా ఆంధ్రాలో తిరుగుతున్న కారుకు 1,88,000 అపరాధ రుసం వేసినట్టు తెలిపారు. పరిమికి మించి లోడ్‌తో వాహనాలు తిరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి'

కాకినాడ రూరల్,జూన్ 22: కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెంలో సౌత్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఆధ్వర్యంలో శనివారం యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై సీఐ ఆర్వే సతీష్‌బాబు వివరించారు. మాదకద్రవ్యాలకు సంబంధించి ఏ సమాచారం తెలిసినా స్థానిక పోలీసులు, సెబ్ అధికారులకు తెలపాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సీతారాం, ఎస్ఐ ఐఎస్ఎస్ బాలాజీ పాల్గొన్నారు.

వేట్లపాలెంలో జిల్లా అధికారుల పర్యటన

గ్రామంలో పరిశుభ్రత చర్యలు


వేట్లపాలెంలో తాగునీటి పంపిణీ విధానాన్ని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారిణి

సామర్లకోట, జూన్ 22: మండలంలోని వేట్లపాలెం గ్రామంలో విరేచనాలతో డయేరియా బారిన పడి పలువురు అస్వస్థతకు గురికాగా వారిలో కొమ్మోజు సత్యవాణి(40) కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో శనివారం ఉదయం మృతిచెందడంతో జిల్లా అధికారుల్లో కలవరం ప్రారంభమైంది. శుక్రవారం గ్రామంలో విరేచనాలతో జొన్నలదొడ్డి తదితర ప్రాంతాలకు చెంది సుమారు 20 మంది అస్వస్థతకు గురయ్యారు. సత్వరం వేట్లపాలెం పీహెచ్‌సీ వైద్యులు వారికి అత్యవసర వైద్యసేవలందించారు. వారిలో ముగ్గురికి ఉన్నత చికిత్సనిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన విషయంపై ఆంధ్రజ్యోతిలో శనివారం కథనం ప్రచురితమైన విషయం విదితమే దీంతో జిల్లా పంచాయతీ అధికారిణి భారతి సౌజన్య, డీఎల్పీవో టీ.అన్నామణి, సామర్లకోట ఎంపీడీవో శ్యామ్‌సుందర్, ఈవోపీఆర్డీ హరికృష్ణసత్యారెడ్డి తదితర పంచాయతీ అధికారులతో కలిసి గ్రామంలో పర్యటించారు. గ్రామంలో 4 ఓహెచ్ఆర్ ట్యాంకులను దగ్గరుండి శుభ్రపరిచే చర్యలు చేపట్టారు. నీటి నమూనాలు సేకరించి తాగునీటిలో కలుషితమైన అవశేషాలు ఉన్నాయా, తాగునీరు క్లోరినేషన్ చేసారా తదితర అంశాలపై పరీక్షలు చేయించారు. పలు ప్రాంతాల్లో మురుగునీరులో ఉన్న పైప్‌లైన్‌లను తొలగించేలా, పైప్‌లైన్ లీకులను అరికట్టేలా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రూపను డీపీవో ఆదేశించారు. వేట్లపాలెం పీహెచ్‌సీలో బాధి తుల నుంచి విరేచనాలకు గల వాస్తవసమాచారాన్ని డీపీవో సేకరించారు. తాగునీటిలో ఏ కలుషితంలేదని డీపీవో అధికారులు నివేదికలను అనుసరించి నిర్ధారించారు.

బాధితులకు ఆర్డీవో పరామర్శ

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ శనివారం ఉదయం వేట్లపాలెం చేరుకుని పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఉన్నత చికిత్స అందేలా పీహెచ్‌సీ వైద్యులను ఆదేశించారు. డయేరియా వ్యాప్తిచెందిన జొన్నలదొడ్డి ప్రాంతాన్ని సామర్లకోట తహశీల్దార్ వై.శ్రీనివాస్‌తో కలిసి పర్యటించారు. ఆయా కుటుంబాల నుంచి సంఘటనకు దారితీసిన పరిస్థితులపై సమాచారాన్ని సేకరించారు. పీహెచ్‌సీ వైద్యులు హిమబిందు, పరదేశి, వీఆర్వోలు మామిడాల కామరాజు, వెంకటలక్ష్మి, కెవీవీ శ్రీను పాల్గొన్నారు. శనివారం గ్రామంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంతో కొత్తగా బాధితులు ఎవరూ ఆసుపత్రికి రాలేదని వైద్యులు చెప్పారు. కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల విద్యార్థులు సుమారు పదిమంది వైద్యబృందం, మైక్రోబయోలజీ ప్రతినిధులు, మెడికల్, పిడియాట్రిక్, తదితర ఎస్పీఎం బృందం వేట్లపాలెంలో ఇంటింటా పర్యటించి తాగునీటి నమూనాలను సేకరించి విశ్లేషించారు. ముందస్తు జాగ్రత్త చర్యలుగా కాచి వడకార్చిన నీటినే తాగాలని నిల్వ ఆహారం ఎట్టి పరిస్థితుల్లోనూ భుజించరాదని సూచించారు.

జనసేన జిల్లా అధ్యక్షుడు పర్యటన

వేట్లపాలెంలో డయేరియా వ్యాప్తి చెంది ఒక మహిళ మృతి, పలువురు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వైనంపై జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు తదితర జనసేన నాయకులతో కలిసి శనివారం గ్రామంలో పర్యటించారు. పీహెచ్‌సీలో వైద్యం పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. బాధితులకు ధైర్యం చెప్పారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

కాకినాడ సిటీ, జూన్ 22: సీజనల్ వ్యాధులతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ సూచించారు. వేట్లపాలెంలో ప్రజలు అతిసార బారిన పడిన నేపథ్యంలో డివిజనల్ స్థాయిలో ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే కంట్రోల్ నంబర్ 80088 03208కు ఫోన్ ద్వారా తెలిపేలా అందుబాటులో ఉంచారు. అదే విధంగా పంచాయతీ, రెవిన్యూ, గ్రామీణ నీటి సరఫరా శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆర్డీవో ఆదేశించారు. ఓవర్‌హెడ్ ట్యాంకులు తక్షణం శుభ్రపరచి క్లోరినేషన్ చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలన్నారు. నిల్వ పదార్థాలు, నిల్వ ఉంచిన మాంసం వంటివి తినరాదని, కాచి చల్లార్చిన వేడి నీటిని మాత్రమే తాగాలని కోరారు.

ఆంధ్రజ్యోతి కథనాలకు స్పందన

నల్లుల నివారణకు చర్యలు

అన్నవరం, జూన్ 22: అన్నవరం దేవస్థానంలో ప్రధాన కాటేజీగా ఉన్న ప్రకాష్‌సదన్ కాటేజీలో నల్లుల నివారణకు శానిటేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రకాష్‌సదన్‌లో నల్లులతో నరకయాతన శీర్షికన ఈనెల 20న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించి సత్రంగదుల్లో ఉన్న పరుపులను ఆరుబయట వేసి కెమికల్స్‌తో పిచికారీ చేపట్టారు. మూడురోజులకు ఒకఫ్లోర్ చొప్పున గదులు అద్దెకివ్వకుండా భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నట్టు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

మంచినీటి ట్యాంక్ క్లీనింగ్

కొత్తపల్లి, జూన్ 22: పొన్నాడ శివారు రావివారిపోడు గ్రామంలో మంచినీటి ట్యాంక్ ద్వారా సరఫరా జరిగే తాగునీటిలో ఎరలు, తోకపురుగులు అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. ఎంపీడీవో పి వెంకటనారాయణ, ఈవోపీఆర్డీ ఎంఎస్.బాస్కర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ సంధ్య, కార్యదర్శి సత్తిబాబు శనివారం రావివారిపోడులో పంచాయతీ పైప్‌లైన్ లీక్‌కు రిపేరు చేయించారు. వాటర్ ట్యాంక్‌ను బ్లీచింగ్‌తో శుభ్రం చేయించారు.

పంట, మురుగు కాలువల ప్రక్షాళన


పాతర్లగడ్డ డ్రెయిన్‌లో ప్రొక్లెయినర్‌తో పూడిక తీస్తున్న దృశ్యం

కరప, జూన్ 22: కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ చొరవతో పంట, మురుగు కాలువల ప్రక్షాళన వేగవంతంగా జరుగుతోంది. కరప మండలంలోని పలు పంటకాలువలు, మురుగుకాలువలు గుర్రపుడెక్క, ఇతర వ్యర్థాలతో పూడుకుపోయి నీటి ప్రవాహానికి అవరోధం ఏర్పడింది. ఇరిగేషన్, డ్రైనేజీశాఖాధికారుల నిర్లక్ష్యంతో కాలువల పూడిక తీత పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో పలువురు రైతులు జనసేన నాయకులతో కలిసి ఎమ్మెల్యే నానాజీకి మొరపెట్టుకున్నారు. వెంటనే స్పందించిన ఆయన సొంత నిధులు వెచ్చించి ఆయా కాలువల్లో గుర్రపుడెక్క, పూడిక తీత పనులు చేయిస్తున్నారు. శనివారం పాతర్లగడ్డ వద్ద వెంకటప్పయ్య డ్రైన్‌లోని పూడికతీత పనులు ప్రారంభించారు. గత 4 రోజులుగా పెనుగుదురు కేఎంజే కెనాల్, పాతర్లగడ్డ కర్రవంతెన, గొర్రిపూడి, కరపలలోని వెంకటప్పయ్యడ్రైన్‌లలో ఈ పూడికతీత పనులు వేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే సొంత నిధులతో కాలువలను బాగుచేయిస్తుండడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

సమగ్ర విద్య సీఎంవో తనిఖీలు

సామర్లకోట, జూన్ 22: సామర్లకోట భవిత విద్యా కేంద్రం ద్వారా దివ్యాంగ విద్యార్థులు హోమ్‌బేస్డ్ విద్యను అందిస్తున్న తీరును పరిశీలించేందుకు సమగ్ర విద్య సీఎంవో చామంతి నాగేశ్వరరావు శనివారం తనిఖీలు నిర్వహించారు. ఎంఈవో పి.పుల్లయ్య భవిత విద్యా కేంద్ర సిబ్బందితో కలిసి వీర్రాఘవపురంలోని భవిత విద్యార్థి యాళ్ళ ప్రజ్ఞ సాయిశ్రీ ఇంటికి సీఎంవో చేరుకుని తనిఖీలు నిర్వహించారు. మండలంలో అన్ని పాఠశాలలకు ప్రభుత్వం మంజూరుచేసిన విద్యాకిట్ల స్టాక్‌పాయింట్‌ను ఆయన పరిశీలించారు. ఇంకనూ యూనీఫాం దుస్తులు, బేగ్‌లు రావాల్సి ఉందని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి

పెద్దాపురం, జూన్ 21: నిత్యం ప్రజల కోసం ఉద్యమించిన నేత యాసలపు సూర్యారావు అని జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. స్థానిక వరహాలయ్యపేటలో ఉన్న యాసలపు సూర్యారావు భవనంలో ప్రజా ఉద్యమ నాయకుడు యాసలపు సూర్యారావు 12వ వర్థంతి సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబురాజుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు యాసలపు ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి), తూతిక రాజు, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, సిరిపురపు శ్రీనివాస్, పెదిరెడ్డి నరేష్, నీలపాల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

'చిన్నారుల ఆలోచన ధోరణిలో మార్పు తీసుకురావాలి'

పిఠాపురం, జూన్ 22: పాఠశాల స్థాయి నుంచే చిన్నారుల్లో ఆలోచణ ధోరణిలో మార్పు తీసుకువచ్చేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ అన్నారు. పిఠాపురంలోని చెలికాని భావనరావు సభాసదన్‌లో శనివారం చిన్నారి మాన్విత రాసిన నవలను ఆవిష్కరణ కార్యక్రమం మన ఊరు మన బాధ్యత, పురూహతికా కల్చరల్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఆవిష్కరణ జరిగింది. వర్మ మాట్లాడుతూ పిఠాపురానికి చెందిన 11 ఏళ్ల మాన్విత అంగ్లంలో ఇన్నర్ పొటెన్షియల్ అన్‌ఎక్స్‌పెక్టెడ్ ఇన్స్‌పిరేషన్ అనే పుస్తకాన్ని రచించడం సంతోషకరమన్నారు. మాన్వితను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొరుప్రోలు శ్రీను, నల్లా శ్రీను, సకుమళ్ల గంగాధర్, అల్లవరపు నగేష్, సీసీఆర్టీ ప్రసాద్ తదితరులున్నారు.

హాస్టల్ పనులు వేగంగా పూర్తిచేయాలి

జిల్లా కలెక్టర్ నివాస్


బాయ్స్ హాస్టల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), జూన్ 22: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాల బాయ్స్ హాస్టల్ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ అధికారులను ఆదేశించారు. శనివారం కాకినాడ బాలాజీచెరువు సెంటర్ వద్ద ఉన్న సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాయ్స్ హాస్టల్‌ను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ అభివృద్ధినిర్మాణ పనుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఎంపీ నిధులు మంజూరు చేసిందన్నారు. అదనంగా నిర్మిస్తున్న గదులు ప్రస్తుతం అవసరం ఉన్న నేపథ్యంలో బిల్లులు వెంటనే సమర్పించి పనులు వేగవంతం చేయాలన్నారు. విద్యార్థులు భోజనం చేసే విధంగా డైనింగ్ హాల్, మరుగుదొడ్లు ఇతర సదుపాయాలతో ఒక బ్లాక్‌ను సిద్ధం చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పరిశీలనలో సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రమణమూర్తి, ఏపీ ఈడబ్లుఐడీసీ వెంకటరాజు, ఏఈ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణకు చర్యలు : జేసీ

కలెక్టరేట్ (కాకినాడ), జూన్ 22: జిల్లాలో కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువులు ధరల నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో శనివారం ధరల పర్యవేక్షణ కమిటీతో సమావేశం నిర్వహించారు. రైతు బజారులో నిర్దేశించిన ధరలు కంటే అధికంగా ఎవరైనా అమ్మకాలు జరిపితే వారి అనుమతులు రద్దు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి నాగేశ్వరరావు, పౌర సరఫరాల మేనేజర్ బాల సరస్వతి, జిల్లా పౌర సరఫరాల అధికారి ప్రసాద్ తదితరులున్నారు.

'పిఠాపురాన్ని అగ్రగామిగా నిలుపుదాం'


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నాగబాబు

గొల్లప్రోలు రూరల్, జూన్ 22: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పిఠాపురం నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలుపుదామని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు సూచించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నివాసంలో ఆయన శనివారం వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా, డివిజనల్, మండలస్థాయి అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాఖల వారీగా జరుగుతున్న కార్యక్రమాలు, వారికి ఉన్న ఇబ్బందులు, సమస్యలు తదితర అంశాలపై అధికారులతో మాట్లాడారు. అందరూ కలిసి ప్రజలకు మెరుగైన సేవలందించాలని, అన్ని శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఏ సమస్యలు ఉన్నా తక్షణం వాటి పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. పవన్‌కల్యాణ్ త్వరలోనే అందరితో సమావేశమవుతారని తెలిపారు. సాయంత్రం కార్యకర్తలతో సమావేశమయ్యారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలని నాగబాబు కోరారు. సమావేశంలో జిల్లా, మండలస్థాయి అధికారులు, జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయకుమార్, నియోజకవర్గ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శాసనసభ స్పీకర్‌కు నెహ్రూ శుభాకాంక్షలు


అయ్యన్నపాత్రుడితో మాట్లాడుతున్న నెహ్రూ, మంత్రులు, ఎమ్మెల్యేలు

జగ్గంపేట, జూన్ 22: ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా ఎన్నికైన నర్సీపట్నం ఎమ్మెల్యే, సీనియర్ టీడీపీ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడును అసెంబ్లీ లాబీలో శనివారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పీఆర్‌లో జాబ్‌మేళా

కాకినాడ రూరల్, జూన్ 22: కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో ఎస్ ఆర్సీ స్థాయి మెగా జాబ్‌మేళాను శనివారం నిర్వహించారు. వివిధ రంగాలకు చెందిన 38 కంపెనీలు హాజరుకాగా జిల్లాకు చెందిన 9 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి 899 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా వారిలో సుమారు 67శాతం మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తిరుపాణ్యం తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధి కల్పనాధికారి టీవీవీ సత్యనారాయణ అభినందించారు.

కాకినాడలో భారీ వర్షం


కాకినాడలో కురిసిన వర్షానికి కూలిన చెట్టు, పడిపోయిన కరెంటు స్తంభం

కాకినాడ సిటీ, జూన్ 22: కాకినాడలో శనివారం తెల్లవారుజామున ఉరుములు, గాలులతో కురిసిన భారీ వర్షానికి పలుచోట్ల చెట్లు నేలకూలాయి. ఓ ప్రాంతంలో కరెంటు స్తంభం ఇంటి మీద పడిపోయింది. తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో ఉరుములు, మెరుపులు మెరిసిన అనంతరం గాలులతో వర్షం ప్రారంభమైంది. సాలిపేట ఫైర్‌స్టేషన్ వద్ద భారీ చెట్టు కూలిపోయింది. దీంతో కటింగ్ మిషన్‌తో ముక్కలుగా కట్ చేసి జవహర్ వీధిలో రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. కచేరీపేట సీఐటీయూ కార్యాలయం వద్ద కరెంటు స్తంభం ఓ ఇంటిమీద పడి పోయింది.

ప్రత్తిపాడు: మండలంలో శనివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. చినశంకర్లపూడిలోని వీధులు జలమయంగా మారాయి. 36ఎంఎం వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

కొత్తపల్లి: మండలంలో శుక్రవారం అర్ధరాత్రి 1గంట ప్రాంతంలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షం కురిసింది. 38.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని ఏఎస్‌వో అప్పలరాజు చెప్పారు.

'నిబంధనలు పాటించకుంటే లైసెన్సులు రద్దు'

గొల్లప్రోలు రూరల్, జూన్ 22: ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల విక్రయాల్లో నిబంధనలు పాటించకుంటే లైసెన్సులు రద్దు చేయడంతో పాటు 6(ఏ) కింద కేసులు నమోదు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్ హెచ్చరించారు. గొల్లప్రోలు మండలపరిషత్ కార్యాలయంలో విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల విక్రయ డీలర్లతో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విక్రయానికి సంబంధించి రైతులకు బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. విత్తనాలు మొలకశాతం చూసిన తర్వాతే విక్రయించాలని చెప్పారు. సమావేశంలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు పి.స్వాతి, మండల వ్యవసాయాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రత్యంగిర హోమం


హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

అన్నవరం, జూన్ 22: రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో శనివారం పౌర్ణమి పర్వదినం సందర్భంగా ప్రత్యంగిర హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం ప్రత్యంగిర దేవతను ఆవాహన చేయించి హోమములు, పారాయణలు, జపములు నిర్వహించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. కనకదుర్గ ఆలయంలో అమ్మవారి జన్మనక్షత్రం మూల సందర్భంగా చండీహోమం నిర్వహించారు.

సత్యదేవుడికి ప్రాకారసేవ

రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా నిర్వహించారు. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను తిరుచ్చిపై ఆశీనులు గావించి ప్రత్యేకపూజలు అనంతరం భక్తుల గోవిందనామస్మరణల నడుమ ముమ్మారు తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షిణ గావించారు.

కాలనీ అభివృద్ధికి విరాళం

అన్నవరం, జూన్ 22: గ్రామంలో ఉన్న తారకరామ కాలనీ అభివృద్ధి నిమిత్తం శంఖవరం మండలం వైస్ ఎంపీపీ దారా వెంకటరమణ రూ.70 వేలు విరాళంగా శనివారం కమిటీసభ్యులకు అందజేశారు. కమిటీసభ్యులు వీటితో ఏపనులు చేపట్టాలో నిర్ణయించుకుని పని ప్రారంభించాలని, అవసరమైతే మరింత సాయమందిస్తానని ఆయన తెలిపారు. దీంతో వెంకటరమణను గ్రామస్థులు, కమిటీసభ్యులు అభినందించారు.

ఏలేశ్వరంలో మహాన్నదానం

ఏలేశ్వరం, జూన్ 22: ఏలేశ్వరంలో సత్యనారాయణస్వామి ఆలయం వద్ద శనివారం అనంత లక్ష్మీ సమేత సత్యనారాయణస్వామి కల్యాణ వార్షికోత్సవంలో భాగంగా సుమారు 1300 మందికి మహాన్నదానం జరిగింది. విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఆలయ ప్రాంగణంలో పారాయణం, లలితా సహస్రం, హనుమాన్ చాలీసా వివిధ పారాయణాలు చేశారు. పురోహితులు పొన్నూరి సత్యనారాయణ, ప్రచార కర్త నల్లమిల్లి కృష్ణబాబు, టీడీపీ పట్టణాధ్యక్షుడు, కౌన్సిలర్ మూది నారాయణస్వామి, అలమండ దుర్గాప్రసాద్, కటకం కిరీటి పాల్గొన్నారు.

రాచపల్లిలో విశిష్ట పూజలు

ప్రత్తిపాడు, జూన్ 22: మండలంలోని రాచపల్లి అరుణాచలేశ్వర ఆలయంలో వేంచేసి ఉన్న అపీత కుంచాబ అమ్మవారికి శనివారం విశిష్ట పూజలు నిర్వహించారు. జ్యేష్ఠ పూర్ణిమి సందర్భంగా ఆలయంలో అమ్మవారికి విశేష అభిషేకాలు, కుంకుమార్చనలు, లలిత పారాయణం, మణిదీప వర్ణన,లలిత చాలీసా, పంచహారతులు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. మహిళాభక్తులు కుంకుమార్చనలు చేశారు. అధికంగా వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

గుర్రంపాలెంలో ప్రత్యేక పూజలు

జగ్గంపేట, జూన్ 22: గుర్రంపాలెంలో శ్రీ గురుదత్త షిరిడి సాయి వీరాంజనేయ సహిత విఘ్నేశ్వరస్వామి మూడో వార్షికోత్సవం సందర్భంగా శనివారం గరిక పూజ,గణపతి హోమం, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ అన్నసంతర్పణ నిర్వహించారు.

ఇన్‌చార్జి కమిషనర్‌గా సత్యకుమారి

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 22: కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు 4 రోజులు సెలవుపై వెళ్లడంతో శనివారం నుంచి బుధవారం వరకు ఇంజనీరింగ్ సెక్షన్ ఎస్ఈ సత్యకుమారి ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తారు.

24, 25న ఐటీఐ కౌన్సిలింగ్

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 22: 2024 విద్యాసంవత్సరానికి ప్రభుత్వ, ప్రయివేట్ ఐటీఐల్లో ప్రవేశం కొరకు ఈనెల 21 నుంచి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో సీట్లు రాని అభ్యర్థులకు జనరల్ పూల్ ద్వారా 24వతేదీన మెరిట్ నెంబర్ 01 నుంచి 561వరకు.. 25వతేదీన మెరిట్ నెంబర్ 562 నుంచి 1115 వరకు మిగిలిన సీట్లకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ యంవిజి వర్మ తెలిపారు. ఈ అవకాశాన్ని ఐటీఐల్లో సీట్లు పొందని అభ్యర్థులు వినియోగించుకోవాలని కోరారు.

'ఆదిత్య' విద్యార్థుల సందర్శన

గండేపల్లి, జూన్ 22: సూరంపాలెంలోని ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్‌లో చదువుతున్న ఎంబీఏ, ఐఎంబీఏ విద్యార్థులు శనివారం ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా శ్రీరామదాసు పేపర్‌బోర్డు జెగురుపాడు, శ్రీచక్ర ఆయిల్ అండ్ ఎక్స్‌ట్రాక్షన్ ప్రయివేట్ లిమిటెడ్‌ను సందర్శించారు. డైరెక్టర్ డాక్టర్ సుగుణారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ విజయభార్గవి, విభాగాధిపతి గోవర్ధనరెడ్డి సహకరించారు.

విద్యార్థికి ఆర్థికసాయం

జగ్గంపేట, జూన్ 22: జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరంలో ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల్లో 592 మార్కులతో జిల్లాలో ద్వితీయస్థానంలో నిలిచిన బి.జ్యోతిక దేవి ఉన్నత విద్యనభ్యసించేందుకు 2001-02 పూర్వ విద్యార్థులు రూ.53,500 అందజేశారు. పూర్వ విద్యార్థులు రుచిహోటల్ నాగేంద్ర, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

సర్పవరం జంక్షన్, జూన్ 22: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో రిటైర్డు తహశీల్దార్ రేలంగి బాపిరాజు సౌజన్యంతో పేద మహిళలకు నిత్యావసర సరుకులు అందజేశారు. బాపిరాజును జిల్లా బాలల సంక్షేమాధికారి సీహెచ్.వెంకట్రావు అభినందించారు. ట్రస్ట్ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాదరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

పోర్టుసిటీ (కాకినాడ), జూన్ 22: నగరంలోని 37వ డివిజన్ టీడీపీ సీనియర్ నాయకుడు మల్లాడి ఏడుకొండలు ద్వితీయ వర్ధంతి సందర్భంగా శనివారం పాతబస్టాండ్ శ్రీ వెంకటేశ్వర కాలనీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఏడుకొండలు కుమారుడు నూకేష్ వర్మ యూత్ సభ్యులు 100 మంది పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో మల్లాడి గంగాధర్, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన కోళ్ల రవి

ప్రత్తిపాడు, జూన్ 22: కేంద్ర పౌర విమాన శాఖా మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడును ప్రత్తిపాడు నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు కోళ్ళ రవి కలిశారు. శనివారం విజయవాడ వచ్చిన రామ్మోహన్‌ను రవి మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి అభినందించారు.